క్లుప్తంగా

పశుగ్రాసం క్షేత్రాలకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని రైతులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశు గ్రాస క్షేత్రాల సాగుకు అర్హులైన అన్నదాతలు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ మధుబాబు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పశుగ్రాస క్షేత్రాల సాగుకు ఆసక్తి ఉన్న 1- 5 ఎకరాల లోపు పొలం ఉన్న సన్నకారు రైతులు దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామన్నారు. పశుగ్రాసం సాగుచేసుంటే అందుకయ్యే ఖర్చులో 100 పని దినాల వేతనం జాబ్‌కార్డు ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకంకింద అర్హత ఉన్న ప్రతి అన్నదాతకు పథకం మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ పథకం ద్వారా రూ.30వేల నుంచి రూ.40 వేల ఆదాయం పొందవచ్చవని తెలిపారు. అవకాశాన్ని అన్నదాతలందరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నాటుసారా స్వాధీనం

పాణ్యం : మండలంలోని పిన్నాపురం గ్రామంలో ఎక్సైజ్ శాఖ పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అక్రమంగా నాటుసారా అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే పాణ్యం చెంచు కాలనీలో మరో వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపారు. అక్రమంగా నాటుసారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడులలో ఎస్‌ఐ బ్రహ్మయ్య, సిబ్బంది విజయుడు, సుధాకర్, ఫరూక్, హరి పాల్గొన్నారు. నాటుసారాకు సంబంధించి ఏమైనా సమాచారం ఉంటే సెల్ 80088 28467, 94409 02586 నంబర్లకు సమాచారం ఇవ్వాలని నంద్యాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ జి.కృష్ణమూర్తి కోరారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: స్థానిక సంతోష్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టనున్న నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సంతోష్‌నగర్, హైదరాబాద్ రోడ్డుకు ఇరువైపులా, బాలాజీనగర్, వెంకటరమణ కాలనీ, అశోక్‌నగర్, శ్రీకృష్ణ కాలనీ, కప్పల నగర్, లేబర్ కాలనీ, అమీన్ అబ్బాస్ నగర్, పున్నమి గెస్ట్‌హౌస్ పరిసరాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు.వినియోగదారులు సహకరించాలని కోరారు.

రక్తదాన శిబిరానికి స్పందన

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో సోమవారం రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, రక్తదానం వల్ల ప్రమాదంలో ఉన్న వ్యక్తుల ప్రాణాలను కాపాడవచ్చన్నారు. శిబిరంలో విద్యార్థులకు గ్రూపింగ్ టెస్టులు నిర్వహించారు. 35 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.ఎస్ కుమార్, రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బి.ఆర్ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈసీజీ మిషన్ విరాళం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ఫిలిప్స్ సంస్థకు చెందిన రెండు ఈసీజీ మిషన్లు, రెండు సక్షన్ ఆపరేటర్లను ఆదోనికి చెందిన దేశాయ్ నర్సింగ్ హోమ్ వారు విరాళంగా అందజేశారు. రూ.లక్ష విలు వ చేసే వీటిని సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు సదరు హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ వసంతి దేశాయ్ అందజేశారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలోని అత్యవసర విభాగాల్లో వీటిని ఉపయోగించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ సీతారామయ్య, అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం ఉన్నారు.

ఇంగ్లిష్ నైట్ వేడుకలు

కర్నూలు సిటీ: నగర శివారు పంచలింగాల సమీపంలోని మాంటిస్సోరి ఒలంపస్ పాఠశాలలో వింటర్ ఫెస్ట్‌లో భాగంగా సోమవారం ఇంగ్లిష్ నైట్ వేడుకలు నిర్వహించారు. ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పి.నాగలక్ష్మి, స్కూల్ డైరెక్టర్లు కె.ఎస్.వి రవి ప్రకాష్, కె.సిదార్థ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను, బాషా నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఇంగ్లిష్ నాటికలు, పాటలు, డ్యాన్సులతో విద్యార్థులు అదరగొట్టారన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు(సెంట్రల్): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం అభినందనీయమని మాంటిస్సోరి ఇండస్ పాఠశాల ప్రిన్సిపాల్ మీనాక్షి పేర్కొన్నారు. సోమవారం జన విజ్ఞానవేదిక రూపొందించిన క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి ఖాజాహుస్సేన్ పాల్గొన్నారు.

అర్బన్ కాలనీల రోడ్లు అధ్వానం


గుంతలయంగా మారిన 20వ వార్డులోని రోడ్డు

ఈ చిత్రంలో కనిపిస్తున్న రోడ్డు కల్లూరు అర్బన్ 20వ వార్డు పరిధిలోనిది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నందికొట్కూరు రోడ్డులోని ఓమెగా ఆస్పత్రి నుంచి నంద్యాల రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మించాలని రూ. 2 కోట్లు కేటాయించింది. రోడ్డు పనులు ప్రారంభించే శిలాఫలకం ప్రజాప్రతినిధులు ఆవిష్కరించడంతో రోడ్డు వెంట వెళ్లే ఆయా కాలనీలకు చెందిన ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. అంతలోనే ఎన్నికల రావడంతో నిలిచిపోయిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. రోడ్డు వెంబడి గుంతలు ఏర్పడడంతో పాటు కంకర దారిలో ప్రయాణిస్తుంటే దుమ్ము లేస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


లక్ష్మీపురం రోడ్డుపై ఏర్పడిన గుంతలు

చిత్రం కనిపిస్తున్నది 44వ జాతీయ రహదారి నుంచి 28వ వార్డు పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి వెళ్లే రోడ్డు. ఈ రోడ్డుపై లక్ష్మీపురం గ్రామానికి చెందిన ప్రజలతో పాటు దొడ్డిపాడు గ్రామానికి చెందిన ప్రజలు, వ్యవసాయ కూలీలు, కళాశాల విద్యార్థులు ప్రయాణిస్తుంటారు. రోడ్డు మొత్తం గుంతలయంగా మారడంతో ప్రయాణం ఇబ్బందిగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- గుంతలమయంగా మారిన రహదారులు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- అవస్థలు పడుతున్న కాలనీల వాసులు

కల్లూరు : కల్లూరు అర్బన్ పలు కాలనీలో రోడ్లు అధ్వానంగా మారాయి. అర్బన్ ప్రాంతం రోజు రోజుకు విస్తరిస్తోంది. అందుకు అవసరమైన మౌలిక వసతులు మాత్రం కల్పించడం లేదని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు. రోడ్లన్నీ గుంతలమయంగా మారడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆయా కాలనీలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

దారంత గుంతలమయం

కర్నూలు నగర శివారులోని జోహరాపురం నుంచి ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రహదారి అడుగడుగునా గుంతలు పడి ఉండడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ రహదారి వెంట రోజు వందల సంఖ్యలో వాహనాలు ఇందిరమ్మ కాలనీతో పాటు వెంకాయపల్లె, గార్గేయపురంలకు వెళ్తుంటాయి. అయితే రోడ్డు గుంతలమయంగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కింద పడి ఎంతో మంది కాళ్లుచేతులు విరగ్గొట్టుకున్నారు. కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రోడ్లు బాగు చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి ఏడునెలలైనా హామీలు అమలు చేయలేదని వాహనదారులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న దారికూడా దెబ్బతినింది. దీంతో ఎదురుగా ఎదైన వాహనం వస్తే భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోంది.


జోహరాపురం నుంచి ఇందిరమ్మ కాలనీకి వెళ్లేరోడ్డు దుస్థితి

నేడు 'పొలం పిలుస్తోంది'

సి.బెళగల్: మండల పరిధిలోని రెండు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ సోమవారం తెలిపారు. ఉదయం పోలకల్ గ్రామ రైతు సేవా కేంద్రంలో, మధ్యాహ్నం బ్రాహ్మణదొడ్డి గ్రామ సచివాలయంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. మధ్యాహ్నం అనంతరం క్షేత్ర పరిశీలనలో భాగంగా రైతులతో కలిసి పంట పొలాల సందర్శన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

నేడు పింఛన్ల పంపిణీ

సి.బెళగల్: మండలంలోని 21 గ్రామాలకు చెందిన పింఛన్ దారులకు ఒక్క రోజు ముందుగా మంగళవారం పింఛన్ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. సోమవారం ఆమె పింఛన్ దారుల వివరాలను వెల్లడించారు. మండల వ్యాప్తంగా 7,130 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని, వీరికి ఆయా గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న 135 మంది సచివాలయాల ఉద్యోగులతో పింఛన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. కాగా మండలంలో 4,105 మంది వృద్ధులు, 1,614 మంది వితంతువులు, 916 మంది దివ్యాంగులు, 15 మంది చేనేత కార్మికులు, ఏడు మంది గీతా కార్మికులు, 115 మంది ఒంటరి మహిళలు, 133 మంది మత్స్యకార, 26 మంది డప్పు కళాకారులు, 13 మంది చెప్పులు కుట్టే, 33 మంది డీఎంహెచ్ఓ, 138 మంది అభయహస్తం, కిడ్నీ వ్యాధిగ్రస్తులు 15 మందితో మొత్తం 7,130 మంది మండలంలో పింఛన్ దారులు ఉన్నట్లు తెలియజేశారు.

ప్రయోగాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత


విద్యార్థులు తయారు చేసిన నమునాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

కల్లూరు: పాఠశాల దశలో విద్యార్థులు ప్రయోగాలు చేయడంతో వారిలో సృజనాత్మకత పెరుగుతుందని ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు శ్రీనివాసులు, వనజకుమారి పర్యవేక్షణలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఎగ్జిబిషన్‌ను ఎంపీడీఓ ప్రారంభించి విద్యార్థులు తయారు చేసిన నమునాలను పరిశీలించారు. మండలంలోని వివిధ పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులు ఎనిమిది అంశాలపై 39 ప్రదర్శనలు తయారు చేశారు. విద్యార్థులు తయారు చేసిన నమునాలలో ఉత్తమ ప్రదర్శనల చేసిన విద్యార్థుల ప్రయోగలను జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపిక చేసి పంపిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు.

వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

సి.బెళగల్: మండల ప్రజలు, యువకులు నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్‌ఐ తిమ్మారెడ్డి అన్నారు. నూతన సంవత్సర వేడుకలలో భాగంగా ఎవరూ రోడ్లపై తిరగరాదన్నారు. ఎవరైనా ప్రజలకు ఇబ్బందులను కలిగేలా ప్రవర్తిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా డీజే సౌండ్స్ ఏర్పాటు చేసుకోవటానికి ఎలాంటి అనుమతులు లేవని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలియజేశారు.

మారని అధికారుల తీరు

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)పై మండల అధికారుల నిరలక్ష్యపు ధోరణి మారడంలేదు. మండల అధికారులు ప్రజా సమస్యలను తెలుసుకోవడం, వాటిని పరిష్కరించడంపై ఆసక్తి కనరపడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇందుకు అధికారులు ప్రవర్తించే తీరే నిదర్శనం. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సెలవులో ఉండటంతో డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) పురుషోత్తం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే పలువురు మండల అధికారులు కార్యక్రమంపై నిర్లక్ష్యంతో గైర్హాజరు అయ్యారు. కేవలం డీటీ, ఏఓ మల్లేష్‌కుమార్ మాత్రమే కార్యక్రమం మొదలవగానే హాజరు అయ్యారు. కాగా కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారులు, వైద్య, విద్యా శాఖల అధికారులు, ఆర్ అండ్‌బీ, విద్యుత్, పీఆర్, ఇరిగేషన్, హౌసింగ్, ఆర్ డబ్ల్యుఎస్ ఏఈలు, వెలుగు, ఉపాధి హామీ, పశువైద్యులు, ఐసీడీఎస్ అధికారులు ఎలాంటి సమాచారం లేకుండా గైర్హాజరైనట్లు డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు. మండల అధికారుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


సి.బెళగల్‌లో పీజీఆర్ఎస్‌కు హాజరైన కేవలం ఇద్దరు అధికారులు

దాతల సేవలు అభినందనీయం

కల్లూరు: దాతల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు మండలం చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ రామ పక్కీర ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల/ ఐఐటీ, మెడికల్ అకాడమీ పూర్వ విద్యార్థులు పే బ్యాక్ సొసైటీలో భాగంగా కళాశాల అభివృద్ధికి సహకరిస్తున్నందుకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల పనితీరు, అక్కడ ఉన్న వసతుల గురించి ఎమ్మెల్యే విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంబేద్కర్ విద్యాసంస్థల జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి కళాశాలలో అదనపు తరగతి గదులు, డైనింగ్ హాల్‌కోసం నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో అకాడమి డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, ప్రిన్సిపాల్ మహానంది, సర్పంచ్ లక్ష్మన్న, ఎంపీటీసీ సామన్న, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ నాగేషాచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కాటసాని చొరవతో విద్యా వలంటీర్ల నియామకం

పాణ్యం : మండల కేంద్రమైన పాణ్యంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ఈనెల 28వ తేదీన నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సందర్శించారు. తమకు ఉపాధ్యాయులు లేరని పదో తరగతి విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించి గ్రీన్‌కో సంస్థ సహాయంతో ఇద్దరు వలంటీర్ ఉపాధ్యాయులను నియమించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ మేరకు గ్రీన్‌కో సంస్థ ప్రతినిధులతో మాట్లాడి పాఠశాలలో గణితం, ఇంగ్లిష్ బోధించే వలంటీర్ ఉపాధ్యాయులను నియమించేందుకు ఒప్పించారు. జనవరి 1వ తేదీ నుంచి విద్యా వలంటీర్లు పాఠాలు బోధించనున్నారని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. సమ్మెలో ఉన్న సిబ్బంది వచ్చే వరకూ వీరు పదవ తరగతి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా బోధన సాగిస్తారని చెప్పారు.

ఎస్సీ జాబితా నుంచి తొలగించాలి

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ జాబితాలో చేర్చిన కురువ, ఇతర ఉన్నత కులాలను తొలగించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ బి.రమేష్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో ఎస్సీ జాబితాలో కురువలు, రెడ్డి కులస్తులను చేర్చిందన్నారు. వెంటనే విచారణ జరిపి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రసాదు, గిడ్డయ్య పాల్గొన్నారు.


కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వీధికుక్కల బెడద నియంత్రణకు చర్యలు

కర్నూలు (టౌన్): నగరంలో శునకాల బెడద నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు పేర్కొన్నారు. సోమవారం గార్గేయపురం డంప్ యార్డు వద్ద ఉన్న కుక్కల సంతాన నియంత్రణ ఆపరేషన్ల కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కొంతకాలంగా కుక్కల సంతాన నియంత్రణ కేంద్రంలో ఆపరేషన్లు నిలిచిపోయాయన్నారు. ఇప్పటికే ప్రభుత్వానికి విన్నవించినట్లు చెప్పారు. జనవరి 8న భారత జంతు సంక్షేమ బోర్డు బృందం నగరానికి వస్తున్నట్లు చెప్పారు. అనుమతి మంజూరైన తరువాత రోజూ 20 శునకాలకు ఆపరేషన్లు ప్రారంభిస్తామన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర రెడ్డి, డీఈఈ గంగాధర్, వెటర్నరీ డాక్టర్ మల్లన్న ఉన్నారు.


శునకాల సంతాన నియంత్రణ ఆపరేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

జయంతి వారోత్సవాలను జయప్రదం చేయండి

ఓర్వకల్లు : చదువుల తల్లులు సావిత్రిబాయిపూలే, ఫాతిమా షేక్‌ల జయంతి వారోత్సవాలను జయప్రదం చేయాలని ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జడ్పీ హెచ్ స్కూల్ వద్ద పాఠశాల హెచ్‌ఎం రామచంద్రారెడ్డి చేతుల మీదుగా కరపత్రాలను ఆవిష్కరించారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ స్త్రీ విముక్తి విద్యతోనే సాధ్యమవుతుందని సావిత్రి బాయి పూలే చెప్పారన్నారు. భారతదేశ తొలి మహిళ ఉపాధ్యాయులు, చదువుల తల్లులు సావిత్రిబాయిపూలే, ఫాతిమా షేక్‌ల జయంతి వారోత్సవాలను జనవరి 3వ తేదీన కర్నూలు జిల్లా పరిషత్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయ్యన్న, బాలకృష్ణ నాయక్, రాజు, శేఖర్ పాల్గొన్నారు.

డీఆర్‌పీల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎస్‌ఈఈడీఏపీ), పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్(పీఎంఎఫ్ఎంఈ) కింద జిల్లా రిసోర్స్ పర్సన్ ఎంపిక కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల తెలిపారు. ఈ పథకం కింద క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ ప్రోగ్రాం కింద చిన్న తరహా ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యమన్నారు. ఎంపికైన అభ్యర్థులు పీఎంఎఫ్ఎంఈ యొక్క నోడల్ ఏజెన్సీ అయిన ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా డీఆర్‌పీలుగా నియమించబడతారని తెలిపారు. 21-30 ఏళ్ల వయస్సు ఉండి గ్రాడ్యుయేట్ పూర్తి చేసి ఉండాలని, ప్రతి మండలానికి ఒక డీఆర్‌పీని రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. కర్నూలు జిల్లాకు 25, నంద్యాల జిల్లాకు 29 మంది డీఆర్‌పీలను నియమిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు జనవరి 5లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు అన్నదానం

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని గాయత్రి ఎస్టేట్స్‌లో ఉన్న జీఎస్‌ఆర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.నాగేశ్వరయ్య తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సోమవారం నగర శివారులోని విజ్ఞానపీఠం విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం వారికి నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం గత 14 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సహకార సంఘ సభ్యుల ఈ-కేవైసీ పూర్తి చేయండి

కర్నూలు(అర్బన్): వ్యవసాయ సహకార సంఘాల్లోని సేవలన్నీ ఆన్‌లైన్ చేస్తున్న నేపథ్యంలో ఆయా పీఏసీఎస్‌ల్లోని సభ్యుల ఈ-కేవైసీని నిర్ణీత సమయంలోగా వంద శాతం పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి కోరారు. సోమవారం మధ్యాహ్నం జెడ్పీలోని తన చాంబర్ నుంచి ఆయన ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీఓలతో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ సహకార సంఘాల్లోని సభ్యుల ఈకేవైసీ పూర్తయితే రైతులకు అనేక రకాల ఉపయోగాలు ఉంటాయన్నారు. అలాగే ఎంఎస్ఎంఈ, కుటుంబ సభ్యుల వివరాల సర్వేలో మిస్సింగ్ సిటిజన్స్ నమోదులో కూడా పురోగతి చూపించాలన్నారు. ఈ నేపథ్యంలోనే 0 నుంచి 6 సంవత్సరాల చిన్నారుల ఆధార్ నమోదు చేసే ప్రక్రియను కూడా వేగవంతం చేసి వంద శాతం పురోగతి సాధించాలన్నారు. ముఖ్యంగా గ్రామ సచివాలయాల్లోని ఉద్యోగుల హాజరుపై దృష్టి సారించాలని, ప్రతి రోజు నిర్ణీత సమయంలోగా వారు హాజరు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలగే గైర్హాజరు అయిన వారి వివరాలకు సంబంధించిన జాబితాలను పంపించాలన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


విద్యార్థులకు క్రీడా వస్తువులు అందజేస్తున్న మాజీ ఐజీ ఇక్బాల్

పాణ్యం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాయలసీమ రేంజ్ మాజీ ఐజీ మహ్మద్ ఇక్బాల్ అన్నారు. సోమవారం పాణ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడాకారులకు క్రీడా సమాగ్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల దశలోనే చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు సరైన క్రీడా పరికరాలు ఉండాలన్నారు. విద్యార్థులు సినిమా, టీవీ, సెల్‌ఫోన్ తదితర వాటికి దూరంగా ఉండాలన్నారు. జీవితం, సినిమా వేరనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. పదవ తరగతి విద్యార్థులు తమ లక్ష్యాలను నెరవేర్చుకునేందుకు ఏకాగ్రతతో చదవాలన్నారు. పాఠశాలలో షెడ్ నిర్మాణం కోసం కృషి చేస్తామన్నారు. పదో రతగతి విద్యార్థులకు రూ.25వేల విలువగల ప్రిపరేషన్ మెటీరీయల్ అందజేస్తానన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయలు జిలానీ బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం ప్రాణేష్‌కుమార్ తెలిపారు. విశ్రాంత ఐజీ, మాజీ ఎంఎల్‌సీ షేక్ ఇక్బాల్ మహమ్మద్ 129 మంది 10వ తరగతి విద్యార్థులకు రూ.40 వేల విలువ చేసే మెటీరియల్‌ను సోమవారం పాఠశాల హెచ్‌ఎంకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హన్నా సైమన్, గౌరి నందనరెడ్డి, అనిత, భారత్‌స్కౌట్ మాస్టర్, మద్దిలేటి, పెద్దస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కర్నూలు సిటీ: ఆర్టీసీ సర్వీసులకు సంబంధించిన అంశాలతో పాటు వివిధ సమస్యల గురించి మంగళవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కర్నూలు వన్ డిపో మేనేజర్ కె.సుధారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కార్గో కొరియర్ డోర్ డెలివరీకి సంబంధించి ఈ నెల 20 నుంచి వచ్చే నెల 19వ తేదీ వరకు జరుగనున్న మాసోత్సవాల్లో భాగంగా కార్గో సేవల గురించి సైతం సమస్యలుంటే తెలియజేయవచ్చన్నారు. ప్రజలు 99592 25805 నంబరుకు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయవచ్చన్నారు.

తాగునీటి పైపులైన్ల లీకేజీ

కోడుమూరు రూరల్ : మండలంలోని బైన్‌దొడ్డి గ్రామానికి బోరు నుంచి తాగునీటిని సరఫరా చేసే పైపులైన్లకు భారీగా లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో గత నెల రోజుల నుంచి గ్రామంలోని మినీ ట్యాంకులకు, కుళాయిలకు నీటిని సరఫరా చేసే సమయంలో లీకేజీల ద్వారా తాగునీరు భారీగా వృథా అవుతోంది. అంతేకాకుండా లీకేజీ నీళ్ల వల్ల పొలాలకు వెళ్లే రస్తాలన్ని బురదమయంగా మారడంతో ప్రయాణించలేని విధంగా తయారైందని రైతులు వాపోతున్నారు. ఇదిలావుండగా పైపులైన్లు లీకేజీలైన చోట నిల్వ ఉన్న నీరు తిరిగి పైపుల్లోకి చేరి తాగునీరు కలుషితమై సరఫరా అవుతున్నాయి. కలుషితమైన నీటిని తాగిన ప్రజలు రోగాల బారీన పడుతున్నారు. అధికారులు స్పందించి పైపులైన్లకు ఏర్పడ్డ లీకేజీలకు రిపేర్లు చేయించి తమ ఇబ్బందులు తొలగించాలని బైన్‌దొడ్డి గ్రామస్తులు కోరుతున్నారు.


పైపులైన్ల లీకేజీలతో పొలాలకు వెళ్లే రస్తాలో నిలిచిన నీరు

క్రీడల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

కోడుమూరు రూరల్ : నంద్యాల జిల్లాలోని బేతంచెర్ల గురుకుల పాఠశాలలో జరిగిన స్పోర్ట్స్ మీట్‌లో గోరంట్ల గురుకుల పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడాంశాల్లో అద్భుతమైన ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ వీరాంజనేయులు సోమవారం తెలిపారు. రాయలసీమ-4 జోన్ పరిధిలో ఈనెల 26 నుంచి 28 వరకు బేతంచెర్లలో జరిగిన స్పోర్ట్స్ మీట్‌లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు హ్యాండ్ బాల్‌లో ప్రథమ స్థానం, వాలీబాల్ పోటీల్లో తృతీయ స్థానం, రన్నింగ్ 1500 మీటర్లు, 400 మీటర్లు రీలే విభాగంలో తృతీయ స్థానం, లాంగ్ జంప్‌లో తృతీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ రాజు అభినందించారు.


క్రీడల్లో రాణించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వీరాంజనేయులు

ట్రాక్టర్ బోల్తా.. కూలీ మృతి

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి - కరిమద్దెల గ్రామాల మధ్య ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఓ కూలీ మృతి చెందినట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. వివిధ మండలాల్లో కూలీ పనులు చేసుకునేందుకు పశ్చిమబెంగాల్ నుంచి కొంతమంది కూలీలు వచ్చారు. వీరు బండిఆత్మకూరులోని రామాపురం గ్రామంలో ఒక ఇళ్లు అద్దెకు తీసుకుని కూలీ పనులు చేసుకుంటున్నారు. సోమవారం పాములపాడులో వరినాట్లు వేసేందుకు పార్నపల్లె గ్రామానికి చెందిన పాణ్యం నాగేశ్వర రెడ్డి ట్రాక్టర్‌లో పది మంది కూలీలు వెళ్తుండగా కరిమద్దెల గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో పశ్చిమబెంగాల్‌కు చెందిన సునీల్ సద్దార్ (49) ట్యాలీ కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. తోటి కూలీ బరున్ సద్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.


ట్రాక్టర్ బోల్తా పడటంతో మృతి చెందిన బిహార్ కూలీ